క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

పాత గుంటూరు: ఆర్టీసీ గుంటూరు 2 డిపో పరిధిలోని ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు, సమస్యలు తెలుసుకునేందుకు శనివారం డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజరు షేక్ అబ్దుల్ సలామ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 వరకు సమస్యలు, సిబ్బంది పనితీరు గురించి ప్రయాణికులు 9959225421 నంబర్‌కు ఫోన్ చేసి తమ సూచనలు, సలహాలు అందించాలని కోరారు.

గొలుసు చోరీ కేసులో నిందితుడు అరెస్టు

గుంటూరు ఈస్ట్: బంగారు గొలుసు చోరీ చేసిన నిందితుడిని లాలాపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏటుకూరు రోడ్డులో ఎం.అంజమ్మ టీ షాపు నిర్వహిస్తోంది. ప్రకాశం జిల్లాకు చెందిన ముప్పరాజు అశోక్ గురువారం టీషాపునకు వచ్చి అంజమ్మను మంచి నీళ్లు అడిగాడు. అంజమ్మ లోపలకు వెళ్లి నీళ్లు ఇచ్చే సమయంలో అశోక్ గల్లాపెట్టెలోని బంగారు గొలుసు తీసుకుని ఉడాయించాడు. అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం నిందితుడిని అదుపులోకి తీసుకుని బంగారం గొలుసు స్వాధీనం చేసుకున్నారు.

అలరించిన సంకీర్తనలు



పాతగుంటూరు: బృందావనగార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని అన్నమయ్య కళావేదికపై బెల్లంకొండ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు చింతలపాటి రమాగోపాలకృష్ణన్ ఆధ్వర్యంలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ సంకీర్తనల గానం నిర్వహించారు. గాయనీమణులు చింతలపాటి రమామహేశ్వరి, పావని, అంజనీదేవి, ప్రణవి వెంగమాంబ కీర్తనలు, అన్నమయ్య సంకీర్తనలను శ్రావ్యంగా గానం చేసి అలరించారు. వీరికి మృదంగంపై జగన్మోహిని, వయొలిన్‌పై పాలేటి గోవర్ధన్ వాయిద్య సహకారాన్ని అందించారు. తిరుప్పావై అమృతవర్షిణి డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి వ్యాఖ్యానంతో కార్యక్రమం భక్తి రసమయంగా సాగింది. కార్యక్రమంలో ఆలయ సంయుక్త కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, నూతలపాటి తిరుపతయ్య పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 120 మంది విద్యార్థులు ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాలలో శుక్రవారం ఈటీఎస్ గ్లోబ్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 120 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికై నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరైన 300 మంది విద్యార్థులకు వివిధ దశల్లో నిర్వహించిన ఎంపికల అనంతరం తుది దశకు చేరుకున్న 120 మంది డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థులను రూ.2.40 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపిక చేశారని వివరించారు. ఈసందర్భంగా ఉద్యోగాలకు ఎంపికై న విద్యార్థులను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కరస్పాండెంట్ జె.మురళీమోహన్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ వై.సురేష్ బాబు అభినందించారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

చినలింగాయపాలెం(కాకుమాను): విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ కేఎఫ్ కెనడీ సూచించారు. మండలంలోని చినలింగాయపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఎంఈఓ వార్షిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా కెనడీ మాట్లాడుతూ విద్యార్థులను ఎ,బి,సి,డి గ్రూపులుగా విభజించి సి,డి గ్రూపులలో ఉన్న విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారిని ఏ గ్రూపులోకి తీసుకువచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన తెలిపారు. హెచ్ఎం నాగమణి, సీఆర్పీలు జమాయమ్మ, సురేంద్ర, చలపతిరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

నారాకోడూరులో చోరీ

చేబ్రోలు: పట్టపగలు ఇంటి తలుపులు వేసి బయటకు వెళ్లిన వృద్ధురాలి ఇంట్లో దొంగతనం జరిగిన సంఘటనలో సుమారు రూ.2లక్షల విలువైన బంగారం, నగదును చోరీ జరగటంపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామానికి చెందిన కొల్లి రాజేశ్వరి వృద్ధ దంపతులు ప్రధాన రహదారి పక్కనే ఉన్న డాబాలో ఉంటున్నారు. ముగ్గురు పిల్లలకు పెళ్లిళ్లు అవటంతో వృత్తి, ఉద్యోగ రీత్యా పిల్లలు వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో ఇంటి తలుపులకు తాళం వేసి పనుల నిమిత్తం కొల్లి రాజేశ్వరి బయటకు వెళ్లింది. సుమారు 12గంటల సమయంలో ఇంటికి వచ్చే సమయానికి ఇంటి తలుపులు పగలకొట్టి లోపలికి ప్రవేశించిన దొంగలు బీరువా తాళాలు పగలకొట్టి అందులోని బంగారం, నగదును అపహరించుకుపోయినట్లు గుర్తించింది. బంగారు నెక్లెస్, గొలుసు, చెవిపోగులు, ఉంగరాలు, రూ.18వేల నగదు చోరీకి గురైనట్లు బాధితురాలు కొల్లి రాజేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఎస్ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

నగర కమిషనర్ కీర్తి చేకూరి



సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో పారిశుద్ధ్య పనులు పక్కాగా జరగాలని, వార్డ్ సచివాలయాల వారీగా శానిటేషన్ కార్యదర్శులే పారిశుద్ధ్య నిర్వహణకు పూర్తి బాధ్యత వహించాలని, పనుల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండే శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలపై కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. శుక్రవారం రాజాగారితోట, రైల్‌పేట, కొత్తపేట, బాలాజీనగర్, పాత గుంటూరు, పొన్నూరురోడ్, జీటీ రోడ్, నరసరావుపేట రోడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న శానిటేషన్ కార్యదర్శిని విధుల నుంచి సస్పెండ్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. మరో కార్యదర్శికి చార్జ్ మెమో ఇవ్వాలని ఆదేశించారు. మణిపురం వంతెన వద్ద అపరిశుభ్రంగా ఉండటంపై 38 సచివాలయం శానిటేషన్ కార్యదర్శి నాగరాజుని విధుల నుంచి సస్పెండ్ చేయాలని, మరో శానిటేషన్ కార్యదర్శి కోటయ్య నాయక్‌కి చార్జి మెమో ఇవ్వాలన్నారు. కృష్ణ మహల్ రోడ్‌లో కమర్షియల్ సంస్థల వారు వ్యర్థాలు రోడ్డు మీద వేయడం, ప్లాస్టిక్ కవర్లు వినియోగించడంపై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత టాస్క్‌ఫోర్స్ బృందం సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఎంహెచ్‌ఓని ఆదేశించారు. సచివాలయాల వారిగా పారిశుద్ధ్య పనులు నూరు శాతం పక్కాగా జరిగేలా శానిటరీ ఇన్‌స్పెక్టర్, కార్యదర్శి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలన్నారు. ఇప్పటికీ పారిశుద్ధ్య సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, పారిశుద్ధ్యం సక్రమంగా లేని ప్రాంతాల్లో ఆయా కార్యదర్శి, ఇన్‌స్పెక్టర్ బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ అంటే ప్రజారోగ్య రక్షణకు కృషి చేయడమేనని, ఇందులో నిర్లక్ష్యంగా ఉండే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మెయిన్ రోడ్లను ఉదయం 7 గంటల్లోపే శుభ్రం చేయించాలని, స్వీపింగ్ మెషిన్ల ద్వారా డివైడర్ పక్కన శుభ్రం చేయించాలన్నారు. శానిటరీ సూపర్‌వైజర్లు ప్రతి రోజు మరింత మెరుగ్గా పర్యవేక్షణ చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై చర్యలకు సిఫార్స్ చేయాలన్నారు. పర్యటనలో ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, ఎస్ఎస్‌లు అయూబ్ ఖాన్, రాంబాబు, శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న కేంద్రం



ధర్నాలో పాల్గొన్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

పాత గుంటూరు: బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.భావన్నారాయణ అన్నారు. శుక్రవారం ప్రజావ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకించాలని కోరుతూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో బ్రాడీపేటలో ధర్నా నిర్వహించారు. పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యుడు కట్లగుంట శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. భావన్నారాయణ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ పేద, మధ్యతరగతి ప్రజలకు వ్యతిరేకంగానూ, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉందని మండిపడ్డారు. దేశ సంపదను అదానీ, అంబానీలకు బీజేపీ ప్రభుత్వం దోచిపెడుతుందని ఆరోపించారు. పేదలకు కొనుగోలు శక్తి పెంచాల్సి ఉండగా, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి అవసరమైన నిధులు కేటాయించకుండా రూ. 90 వేల కోట్ల నుంచి రూ. 60 వేల కోట్ల రూపాయలకు తగ్గించటం దారుణం అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయలేదని, అలాగే పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో మహిళా సంఘం(ఐద్వా) జిల్లా కార్యదర్శి లక్కా అరుణకుమారి, సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు బి.ముత్యాలరావు, ఎంఏ చిష్టీ, నగర నాయకులు షేక్ ఖాశిం షహీద్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులకు నిధులు పెంచాలి

పెదనందిపాడు: ఉపాధిహామీ పనులకు, వ్యవసాయ రంగానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు పెంచాలని సీపీఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం పెదనందిపాడు పాతబస్టాండ్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధి హామి, పంచాయతీ కార్మికుల ముఖ హాజరు రద్దు చేయాలని కార్మికులకున్న హక్కులను కాపాడాలనుకుంటే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఆయన కోరారు. విశాఖ రైల్వేజోన్‌ను ప్రకటించి నిధులు కేటాయించాలన్నారు. గుంటూరు చానల్ పొడిగింపు బడ్జెట్‌లో నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నాయకులు ముద్దన వెంకటేశ్వర్లు, చుక్కా యానాదులు, మద్దూరి రమణ, తెలగతోటి రామరాజు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కాకుమాను: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వ సభ్యసమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి.శరత్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే సమావేశంలో మండలంలో చేపట్టవలసిన అభివృద్ధి పనులు, తదితర అంశాల గురించి చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

వెయిటింగ్ హాల్ నిర్మాణానికి భూమిపూజ

పెదనందిపాడు: పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్సెస్ కళాశాలలో గార్ల్స్ వెయిటింగ్ హాల్ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్సెస్ కళాశాలలో ఎంపీ వై.సుజనా చౌదరి ఫండ్స్ నుంచి రూ. 25 లక్షలు శాంక్షన్ అయ్యాయని కళాశాల యాజమాన్య అధ్యక్షుడు కాళహస్తీ సత్యనారాయణ తెలిపారు. కళాశాల విద్యార్థినులకు అత్యాధునిక వసతులతో కూడిన వెయిటింగ్ హాల్ నిర్మిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యాజమాన్య సభ్యులు లావు ఆదిశేషయ్య, నర్రా బాల వెంటక రామకృష్ణ, నర్రా వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

ప్రత్తిపాడు: అప్పుల బాధతో వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ప్రత్తిపాడుకు చెందిన గండు శ్రీనివాసరావు (40) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి అర ఎకరం సొంత పొలం ఉంది. దీనికి తోడు మరికొంత పొలం కౌలుకు తీసుకొని ప్రతి ఏటా వ్యవసాయం చేస్తుంటాడు. అయితే చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాక 23వ తేదీ రాత్రి శ్రీనివాసరావు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కొద్దిసేపటికి భార్యకు ఫోన్ చేసి అప్పులు తీర్చడం తన వల్ల కాదని, పురుగు మందు తాగి చనిపోతున్నానని చెప్పి ఫోన్ పెట్టేశాడు. శుక్రవారం ప్రత్తిపాడు పంచాయతీ పరిధిలోని రావిపాటివారిపాలెం సమీపంలో నల్లకుంటకు వెళ్ళే డొంకలో శ్రీనివాసరావు మృతదేహం పడి ఉండటాన్ని స్థానికులు గమనించారు. భార్య గండు హైమావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్ఐ ఆరోగ్యరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్స్ తప్పనిసరి



ప్రజారోగ్య అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో నూతన డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్సులు, రెన్యూవల్స్‌కు తప్పనిసరిగా సదరు సంస్థల ఆస్తి, ఖాళీ స్థల, నీటి పన్నులు పూర్తిగా చెల్లించిన రశీదులు ఉంటేనే చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి శానిటేషన్ కార్యదర్శులు, ప్రజారోగ్య అధికారులకు స్పష్టం చేశారు. శుక్రవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో ప్రజారోగ్య విభాగ అధికారులతో, జూమ్ ద్వారా శానిటేషన్ కార్యదర్శులతో నగరంలో పారిశుద్ధ్య పనులు, ఇంటింటి చెత్త సేకరణ, ట్రేడ్ లైసెన్స్‌లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రతి కమర్షియల్ సంస్థ తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ట్రేడ్ లైసెన్స్ నూతనంగా మంజూరు చేసేప్పుడు సదరు సంస్థ నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన అన్ని రకాల పన్నులు చెల్లించి ఉంటేనే దరఖాస్తు ప్రాసెస్ చేయాలని శానిటేషన్ కార్యదర్శులకు, ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. పన్ను వివరాల కోసం సంబంధిత వార్డ్ అడ్మిన్ కార్యదర్శితో సమన్వయం చేసుకోవాలన్నారు. సచివాలయం పరిధిలో ప్రాపర్టీ ట్యాక్స్ మ్యాపింగ్ రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ప్రతి షాప్ వద్ద డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోవాలని, వ్యర్థాలను రోడ్ల పై, కాల్వల్లో వేసే షాప్స్ సీజ్ చేయాలని ఆదేశించారు. నిర్మాణాలు జరుగుతున్న భవనాలకు ప్లానింగ్ కార్యదర్శులను సమన్వయం చేసుకుంటూ గ్రీన్ మ్యాట్‌లు ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. సచివాలయం పరిధిలో కార్మికులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎఫ్ఆర్ఎస్ ద్వారానే హాజరు తీసుకోవాలని, ప్రతి కార్యదర్శి ప్రజలకు హోం కంపోస్ట్ తయారి ప్రాధాన్యత, తయారి విధానంపై అవగాహన కల్పించాలని, అలాగే అపార్ట్‌మెంట్స్‌లో క్లస్టర్ కంపోస్ట్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. 2023 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గుంటూరు నగరం మెరుగైన ర్యాంక్ సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సిఎంఓహెచ్ డాక్టర్ విజయలక్ష్మీ, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, ఈఈ కొండారెడ్డి, ఏఈ దుర్గా ప్రసాద్, ఎస్ఎస్‌లు రాంబాబు, అయూబ్ ఖాన్, సోమశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

బాబు పంచన చేరి కాపుల మనోభావాలు దెబ్బతీసిన కన్నా



రంగా విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మేయర్ కావటి, ఎమ్మెల్సీ డొక్కా, ఎమ్మెల్యే మద్దాళి, ఏసురత్నం

నెహ్రూనగర్: అవినీతికి, నమ్మకద్రోహానికి నిలువెత్తు నిదర్శనమైన చంద్రబాబు నాయుడు పంచన చేరి కన్నా లక్ష్మీ నారాయణ కాపుల మనోభావాలను కించపరిచారని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు విమర్శించారు. కాపులకు నమ్మక ద్రోహం చేసి టీడీపీలో కన్నా లక్ష్మీ నారాయణ చేరడాన్ని ఖండిస్తూ శుక్రవారం నగరంపాలెంలోని మూడు బొమ్మల సెంటర్ వద్ద గల వంగవీటి మోహన రంగా విగ్రహానికి ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్, మిర్చి యార్డ్ చైర్మన్ చంద్రగిరి ఏసురత్నంలు క్షీరాభిషేకం చేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కాపుల అభ్యున్నతికై కృషి చేసిన వంగ వీటి రంగాను హత్య చేయించిన చంద్రబాబుని విమర్శించి, ఆయన పార్టీలోనే కన్నా లక్ష్మీనారాయణ చేరి, కాపులను తలదించుకునేలా చేశారన్నారు. రంగా వారసుడిగా ప్రకటించుకొని కాపుల ఓట్లతో రాజకీయ పబ్బం గడుపుకున్న కన్నా ఇప్పుడు రంగా హత్యలో కీలకమైన చంద్రబాబు పక్షాన చేరి కాపులను మోసం చేశారన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, జిల్లాలో కన్నా లక్ష్మీ నారాయణలు అవుట్ డేటెడ్ రాజకీయ నాయకులని, జననేత జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శిస్తే రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ కన్నా లక్ష్మీ నారాయణ తెలుగు దేశం పార్టీలో చేరుతూ వైఎస్సార్ సీపీని విమర్శించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ టీడీపీని, చంద్రబాబు నాయుడుని పదే పదే తిట్టిన కన్నా నేడు ఆయన సమక్షంలోనే టీడీపీలో చేరడం సిగ్గు చేటన్నారు. డెప్యూటీ మేయర్లు వనమా బాల వజ్ర బాబు, షేక్ సజీల, వైఎస్సార్ సీపీ సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, గుంటూరు తూర్పు నియోజకవర్గ మహిళా నాయకురాలు షేక్ నూరి ఫాతిమా, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నాట్‌లో కెనడీ విద్యార్థి ప్రతిభ



జోయల్ అనురాగ్‌ను అభినందిస్తున్న సావిత్రి, ఐజాక్ కుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ అలయెన్స్ (నీసా) ఆధ్వర్యంలో గతనెల 15న నిర్వహించిన జాతీయస్థాయి ఎనలైటికల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (నాట్) లో కెనడీ ఇంగ్లిష్ మీడియం స్కూల్ టెన్త్ విద్యార్థి జోయల్ అనురాగ్ తృతీయ బహుమతి పొందినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.ఐజాక్ కుమార్ తెలిపారు. శుక్రవారం అరండల్‌పేటలోని కెనడీ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో ఐజాక్ కుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరిగిన నాట్ పోటీ పరీక్షల్లో మూడు వేల మంది విద్యార్థులు పాల్గొనగా, వారిలో తమ విద్యార్థి తృతీయ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. ఈనెల 19న హర్యానాలోని పంచకుల్‌లో జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో విజేతలకు బహుమతులు అందజేశారని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థి జోయల్ అనురాగ్‌ను పాఠశాల వ్యవస్థాపకురాలు కేవీ సావిత్రి, డైరెక్టర్లు కె.శ్రీకాంత్‌బాబు, డాక్టర్ కె.శ్రీవిద్య, ప్రిన్సిపాల్ ఐజాక్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య అభినందించారు.



● కొరిటెపాడులోని ఒక ఫంక్షన్ హాల్‌లో గుంటూరు యువకుడు సాయి పవన్ కృష్ణ, అమెరికా అమ్మాయి లోపేజ్ అకోస్టాలు శుక్రవారం వేదమంత్రాల సాక్షిగా ఒక్కటయ్యారు. వివాహానికి ఇరుపక్షాల బంధుమిత్రులు హాజరై నూతన జంటను ఆశీర్వదించారు.
- సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

పైపులైన్ ఎయిర్ వాల్వ్ లీకై నీరు వృథా



శ్రీనగర్ మెయిన్ రోడ్డులో లీకైన ప్రాంతం

నెహ్రూనగర్: నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి హెచ్ఎల్ఆర్(హై లెవల్ రిజర్వాయర్)కు సక్రమంగా నీటి సరఫరా చేసేందుకు గతంలో ఉన్న 800 ఎంఎం డయా పైపులైను బదులు గత రెండేళ్ల క్రితం వేసిన 900 ఎంఎం డయా పైపులైన్‌ను వర్కింగ్‌లోకి తీసుకువచ్చేందుకు ఇంజినీరింగ్ అధికారులు గురువారం రాత్రి ఇంటర్ కనెక్షన్ ఇచ్చారు. గురువారం ఉదయం నుంచి 900 ఎంఎం డయా పైపులైన్ నుంచి హెచ్ఎల్ఆర్‌కు మంచినీటి సరఫరా చేసే క్రమంలో శ్రీనగర్ మెయిన్‌రోడ్డుపై వద్ద రోడ్డుపై శుక్రవారం సాయంత్రం పెద్దఎత్తున నీరు రోడ్డుపైకి చేరాయి. 900 ఎంఎం డయా పైపులైన్ గత రెండేళ్ల క్రితం వేసింది కావడంతో దానికి పంపింగ్ సమయంలో నీటి ఒత్తిడి పెరిగి కొత్తగా వేసిన బీటీ రోడ్డును చీల్చుకుంటూ నీరు బయటకు వచ్చింది. 900 ఎంఎం డయా పైపులైన్ వేసిన తరువాత ట్రయల్ రన్ నిర్వహించకపోవడంతో ఎయిర్ వాల్వ్ లీకై నీరు బయటకు వచ్చిందని, వీలైనంత త్వరలో పూర్తి చేసి పంపింగ్ చేస్తామని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

ఫార్మశీతో ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న డాక్టర్ కారుమూరి శ్రీనివాసరెడ్డి, పక్కన డాక్టర్ దక్షిణామూర్తి, డాక్టర్ శివ శిరీష

గుంటూరు మెడికల్: ఫార్మశీ రంగం నానాటికీ అభివృద్ధి చెందుతోందని, ఫార్మశీ కోర్సు అభ్యసించిన వారికి ఉజ్వల భవిష్యత్తు లభిస్తోందని సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ కారుమూరి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక మంగళదాస్‌నగర్‌లోని సిమ్స్ ఫార్మశీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు జరిగాయి. వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఫార్మశీ అభ్యసించిన వారికి దేశ, విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. నూతన ఔషధాలను కనుగొని వ్యాధులను త్వరితగతిన తగ్గించడంలో యువ ఫార్మాశిస్టులు చొరవ చూపించాలన్నారు. డాక్టర్ దక్షిణామూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక జీవనశైలి వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నట్లు వెల్లడించారు. జీవన శైలిలో మార్పు చేసుకోవాలని, వ్యక్తిగత, వృత్తిపరమైన ఎదుగుదలకు విద్యార్థులు తమ జీవితాన్ని ఏవిధంగా మలచుకోవాలనే విషయాలను వివరించారు. సిమ్స్ సెక్రటరీ డాక్టర్ జి.శివశిరీష మాట్లాడుతూ ఫార్మాశీ విద్యార్థులకు నాణ్యమైన బోధన తమ కళాశాలలో అందిస్తున్నామని, పలు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు తమ కళాశాలలో అభ్యసిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆహూతులను అలరించారు.

కీళ్ల మార్పిడిలో విప్లవాత్మక మార్పులు

- రోగికి తక్కువ ఖర్చుతో వైద్యం అందేలా ఉండాలి
- ఆర్థోపెడిక్ రాష్ట్రస్థాయి సదస్సులో డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి

గుంటూరు మెడికల్: ప్రస్తుతం అందుబాటులో ఉన్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కీళ్ల మార్పిడిలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టామని సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. గుంటూరు మెడికల్ కళాశాలలోని జింఖానా ఆడిటోరియంలో ఆర్థోపెడిక్ సర్జన్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. సదస్సులో డాక్టర్ నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం కీళ్ల మార్పిడిలో రోబోటిక్ తరహా అత్యాధునిక సాంకేతిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయన్నారు. సాంకేతికతను ఒడిసి పట్టి రోగికి తక్కువ ఖర్చుతో అధునాతన వైద్య సేవలు అందేలా చూడాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. దక్షిణ భారతదేశంలోనే జాయింట్ రీప్లేస్‌మెంట్ హబ్‌గా గుంటూరు నగరం మారిందని తెలిపారు. వరల్డ్ క్లాస్ ఇంప్లాంట్స్ గుంటూరు నగరంలోని హాస్పిటల్స్ లో అందుబాటులో ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద తుంటి మార్పిడి శస్త్ర చికిత్సను తీసుకురావడం పేద రోగులకు వరమన్నారు. యువ ఆర్థోపెడిక్ వైద్యులు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ఈ సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

ఆకట్టుకున్న స్టాల్స్



నిమ్మరసం తాగుతున్న డాక్టర్ బాబ్జి, పక్కన డాక్టర్ పద్మావతి దేవి, డాక్టర్ ప్రభావతి

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో శుక్రవారం ఆర్థోపెడిక్ సర్జన్స్ రాష్ట్ర సదస్సు ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరుగనున్న సదస్సును డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. సదస్సు ప్రారంభానికి ముందు ఆడిటోరియం ప్రాంగణంలో పలు రకాల ఆర్థోపెడిక్ స్పెషాలిటీ వైద్య పరికరాల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటిల్లో గ్రామీణ నేపథ్యం ఉట్టిపడేలా చలువ పందిళ్లతో, తాటాకులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను డాక్టర్ బాబ్జి వీక్షించారు. స్టాల్స్‌లో గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా అంగళ్లు ఏర్పాటు చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకు వచ్చేలా చక్రాలు, చకోడిలు, బఠాణీలు, ఉప్పుశనగలు, తదితర ఆహార పదార్థాలు, సోడాలు, చెరుకు గడలు అందరిని అమితంగా ఆకట్టుకున్నాయి. పూర్వకాలపు సినిమా పోస్టర్లు స్టాల్స్ ఉంచడంతో గత కాలపు సినిమాల మధురస్మృతులు వైద్యులు నెమరు వేసుకున్నారు.

ప్రతిభకు పురస్కారం



చేబ్రోలు పీఎస్ సీఐ సుబ్బారావుకి ప్రశంసా పత్రం అందిస్తున్న ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

నగరంపాలెం: వివిధ కేసుల్లో ప్రతిభ కనబరిచిన సీఐలు, ఎస్ఐ, కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ అభినందించారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని స్పందన హాల్‌లో శుక్రవారం జిల్లా నేర సమీక్ష సమావేశం జరిగింది. సమావేశ అనంతరం చేబ్రోలు పీఎస్ సీఐ సుబ్బారావు, ఎస్ఐ డి.రవీంద్రబాబు, మహిళా కానిస్టేబుల్ నాగమణి, తాడికొండ పీఎస్ సీఐ శ్రీనివాసరావు, కానిస్టేబుల్ బి.కిరణ్‌బాబును ప్రత్యేకంగా అభినందించి ప్రశంస పత్రాలను అందించారు. 2021లో కాకుమాను మండలం వల్లూరులో తల్లిని తనయుడు హత్య చేయగా, ఈ కేసులో తనయుడికి గురువారం యావజ్జీవ కారాగార శిక్ష విధించారు.



చేబ్రోలు ఎస్ఐ రవీంద్రబాబు



చేబ్రోలు మహిళా కానిస్టేబుల్ నాగజ్యోతి



తాడికొండ సీఐ శ్రీనివాసరావు



తాడికొండ కానిస్టేబుల్ కిరణ్‌బాబు

2015లో తాడికొండ పాములపాడులో ఒకరిని హత్య చేయగా, అందులో ముగ్గురికి పదేళ్లు, మిగతా అయిదుగురికి ఒక్కొక్క సంవత్సరం కారాగార శిక్ష రెండు రోజుల క్రితం విధించారు. ఈ క్రమంలో విధులు సమర్థవంతంగా నిర్వర్తించిన సీఐలు, ఎస్ఐ, కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించారు.

రైతాంగ పోరాట యోధురాలు జయమ్మ

పాతగుంటూరు: అరండల్‌పేట పదోలైనులోని కామ్రేడ్ మాదాల నారాయణస్వామి భవనంలో శుక్రవారం సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నగర కమిటీ ఆధ్వర్యంలో శ్రీకాకుళ సాయుధ గిరిజన రైతాంగ పోరాట యోధురాలు, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు పోతనపల్లి జయమ్మ వర్ధంతి సభ నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఎస్‌వీ కృష్ణ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు యు.గనిరాజు తదితరులు పాల్గొన్నారు.